# తరగతి - 10

## కవి పరిచయాలు

### 3. జానపదుని జాబు



**39.** **రచయిత** : బోయి భీమన్న

**కాలం** : 1911 - 2005

**బాల్యం** : తూర్పుగోదావరి జిల్లా మామిడికుదురు గ్రామంలో పేద దళిత కుటుంబంలో జన్మించారు.

**రచనలు** : ఈయన రాసిన 'పాలేరు' ఎంతో మంది పేదలు, దళిత కుటుంబాలలో వెలుగులు నింపింది. గుడిసెలు కాలిపోతున్నాయ్, ఉగాదులు, జానపదుని జాబులు, రాగవైశాఖి, పిల్లీశతకం, ధర్మం కోసం పోరాటం మొదలైన రచనలు చేశాడు.

**ఇతర విశేషాలు** : మహాత్మాగాంధీ, డా॥ బాబాసాహెబ్ అంబేద్కర్ బోధనలతో ప్రభావితుడై అస్పృశ్యతను తన కలం ద్వారా రూపుమాపాలని తలచిన మేధావి. స్వాతంత్ర్యోద్యమ సమయంలో క్విట్ ఇండియా ఉద్యమంలో పాలుపంచుకొన్నాడు. కొంతకాలం జర్నలిస్టుగా పనిచేశాడు. ఇతని 'గుడిసెలు కాలిపోతున్నాయ్' రచనకు 1975లో సాహిత్య అకాడమి అవార్డు లభించింది. ఆంధ్ర విశ్వవిద్యాలయం వారి కళాప్రపూర్ణ అనే బిరుదు రూపంలో గౌరవ డాక్టరేటును పొందాడు. భారత ప్రభుత్వం ఈయనను 1973లో పద్మశ్రీ, 2001లో పద్మభూషణ్‌లతో సన్మానించింది.

### 4. వెన్నెల

**40.** **రచయిత** : 'వెన్నెల' పాఠ్య రచయిత ఎఱ్ఱన. కవిత్రయంలో మూడవ వాడు.

**కాలం** : 14వ శతాబ్దపు ప్రథమార్ధంలో జీవించాడు. ఎఱ్ఱన తల్లిదండ్రులు పోతమాంబిక, సూరనార్యులు. ఈయన గురువు శంకరస్వామి. అద్దంకిని రాజధానిగా చేసుకొని పాలించిన ప్రోలయ వేమారెడ్డి ఆస్థానకవి.

**రచనలు** : ఆంధ్రమహాభారతంలోని అరణ్యపర్వశేషము, నృసింహపురాణము, రామాయణము, హరివంశము మొదలగు గ్రంథాలను ఎఱ్ఱన రచించాడు.

**బిరుదులు** : ఎఱ్ఱనను 'ప్రబంధ పరమేశ్వరు'డంటారు. ఇతని శివభక్తి పారమ్యాన్ని అనుసరించి 'శంభుదాసు'డని పేరుగాంచారు.

**శైలి** : వర్ణనాత్మక శైలి.

**గ్రహింపబడిన గ్రంథం** : నృసింహపురాణం తృతీయాశ్వాసం

## 5. ధన్యుడు

**41. రచయిత** : 'ధన్యుడు' పాఠ్య రచయిత చిన్నయసూరి.

**కాలం** : 1809 - 1862

**రచనలు** : చిన్నయసూరి అక్షరగుచ్ఛము, ఆంధ్ర కాదంబరి, పద్యాంధ్ర వ్యాకరణము, సూత్రాంధ్ర వ్యాకరణము, శబ్దలక్షణసంగ్రహము, బాలవ్యాకరణము, నీతిచంద్రిక మొదలైన గ్రంథాలు రాశాడు.

**రచనాశైలి** : ఈయన రాసిన బాలవ్యాకరణము నేటికీ ప్రామాణిక గ్రంథంగా ఉంది. నీతిచంద్రిక - బాలవ్యాకరణాలు లక్ష్య - లక్షణ గ్రంథాలుగా ప్రసిద్ధి పొందాయి. ఈయన రచనాశైలి పాఠకుని ఆకట్టుకొనేలా ప్రాచీన కావ్య భాషలో ఉంటుంది.

**ఇతర విశేషాలు** : చిన్నయసూరి మద్రాసులోని పచ్చయ్యప్ప కళాశాలలో తెలుగు పండితుడుగా పనిచేశాడు. 'సూరి' అనేది ఈయన బిరుదు. సూరి అంటే పండితుడు అని అర్థం. తెలుగు, తమిళ, సంస్కృతాంగ్ల భాషలలో చిన్నయసూరి మంచి పండితుడు.

## 6. శతక మధురిమ

**42. కవి** : ఏనుగు లక్ష్మణ కవి తూర్పుగోదావరి జిల్లా పెద్దాడ గ్రామంలో నివసించారు.

**కాలం** : క్రీ.శ. 1720 - 1780 మధ్యకాలంలో జీవించినట్లుగా చారిత్రకుల అభిప్రాయం.

**రచనలు** : భర్తృహరి సంస్కృతంలో రచించిన 'సుభాషిత త్రిశతి' ని తెలుగులోకి అనువదించారు. దాని పేరు సుభాషిత రత్నావళి. రామేశ్వర మాహాత్మ్యం, విశ్వామిత్ర చరిత్ర, గంగామాహాత్మ్యం, రామవిలాసం వీరి ప్రసిద్ధ రచనలు.

**43. కవయిత్రి** : తరిగొండ నృసింహ శతకం రాసింది - తరిగొండ వెంగమాంబ.

**కాలం** : 18వ శతాబ్దం. చిత్తూరు జిల్లా తరిగొండ గ్రామ నివాసిని. బాల్యం నుంచే భగవద్భక్తురాలు.

**రచనలు** : తరిగొండ నృసింహశతకంతో పాటు శివనాటకం, నారసింహవిలాసకథ అనే యక్షగానాలు, రాజయోగామృతం అనే ద్విపద కావ్యం, శ్రీ వేంకటాచల మాహాత్మ్యం, అష్టాంగ యోగసారం, వాశిష్ఠ రామాయణమనే పద్యకావ్యాలు రచించి ప్రసిద్ధికెక్కింది.

**44.** కవి : భక్త చింతామణి శతకం రాసింది – వడ్డాది సుబ్బారాయకవి.

కాలం : 'వసురాయకవి'గా ప్రసిద్ధి పొందిన వడ్డాది సుబ్బారాయకవి 20వ శతాబ్దానికి చెందినవాడు. ఈయన రాజమహేంద్రవరంలోని దొరతనం వారి ఫస్ట్‌గ్రేడ్ కళాశాలలో ఆంధ్రోపన్యాసకులుగా పనిచేశాడు.

రచనలు : 'హిందూ జనసంస్కారిణి' అనే పత్రికలో 'భక్తచింతామణి' పేర ఎనభై పద్యాలు రాశాడు. తరవాత దాన్ని భక్తచింతామణి శతకంగా పూర్తిచేశాడు. వీరి 'వేణీసంహారం' అనే నాటకం చాలా ప్రసిద్ధి పొందింది. 'ప్రబోధ చంద్రోదయం' అనే నాటకం, 'నందనందన శతకం', భగవత్కీర్తనలు అనేవి ఈయన ఇతర రచనలు.

**45.** కవి : భాస్కర శతక కర్త – మారన వెంకయ్య. ఈయనను మారద వెంకయ్య, మారవి అని కూడా కొందరు అంటారు.

కాలం : ఈయన 1550–1600 కాలంలో జీవించి ఉండవచ్చునని విమర్శకుల అభిప్రాయం.

ఇతర విశేషాలు : సుమతీ, వేమన శతకాల తరువాత విస్తృత ప్రచారంలోనికి వచ్చిన నీతిశతకాలలో భాస్కరశతకం మొదటిది. భాస్కరశతకము తెలుగులో వెలసిన మొదటి దృష్టాంతశతకము. ప్రత్యక్ష నీతిబోధకంటే దృష్టాంత పూర్వకమైన అంటే ఉదాహరణతో నీతిబోధ చాలా ప్రభావవంతంగా ఉండగలదు.

**46.** కవి : దాశరథి శతక కర్త – కంచెర్ల గోపన్న.

కాలం : 17వ శతాబ్దానికి చెందినవారు. ఈయనకే రామదాసు అనే పేరుంది.

ఇతర విశేషాలు : ఈయన భద్రాచలంలో శ్రీరామునికి దేవాలయాన్ని పునరుద్ధరణ చేయించాడు. సీతారామలక్ష్మణులకు, హనుమంతులకు ఆభరణాలు చేయించాడు. కారాగారంలో బంధించబడినపుడు శ్రీరామునిపై అనేక కీర్తనలను పాడుకున్నాడు. అవే రామదాసు కీర్తనలుగా ప్రసిద్ధి చెందాయి. దాశరథీ! కరుణాపయోనిధీ! అనే మకుటంతో ఉన్న పద్యం దాశరథి శతకంలోనిది.

**47.** కవి : 'ధూర్జటి' కవి శ్రీకాళహస్తీశ్వరశతకం రచించాడు.

కాలం : 16వ శతాబ్దం.

ఇతర విశేషాలు : ధూర్జటి శ్రీకృష్ణదేవరాయల ఆస్థానంలో అష్టదిగ్గజ కవులలో ఒకడిగా ఉండి అనేక సత్కారాలను పొందాడు. కాళహస్తి మాహాత్మ్యమును ప్రబంధశైలిలో రచించాడు. ధూర్జటి పరమ శివభక్తుడు. శుద్ధ శైవుడు.

**48.** కవి : సుమతీ శతక కర్త – బద్దెన. 'సుమతీ!' అన్న మకుటంతో ఉన్న పద్యం 'సుమతీ శతకం' లోనిది.

కాలం : 13వ శతాబ్దానికి చెందినవారు.

ఇతర విశేషాలు : సుమతీశతకం రచనావిధానం లలితంగా ఉంటుంది. లలితమైన శబ్దాలతో హృదయంగమమైన శైలిలో సరళంగా సాగుతుంది. సులభంగా భావాలను పఠితల మనస్సులకు హత్తుకునేటట్లుగా ఈ శతక రచన ఉంటుంది. తరువాత కాలంలో కందపద్యాలలో శతకాలు రాసినవారికి బద్దెన ఆదర్శంగా నిలిచాడు. నాటి సమకాలీన ప్రజల జీవిత విధానాన్ని వారి మనస్తత్వాన్ని బద్దెన బోధించిన నీతులు అద్దాలవలే ప్రతిఫలిస్తున్నాయి.

## 7. మా ప్రయత్నం



**49. ఓల్గా :** ప్రముఖ రచయిత్రి. ఎన్నో పుస్తకాలకు సంపాదకత్వం నిర్వహించిన వీరు పలు పురస్కారాలను, అవార్డులను అందుకున్నారు. వీరి 'స్వేచ్ఛ' నవల ప్రసిద్ధిపొందింది.



**50. వసంత కన్నబిరాన్ :** వీరు మానవ హక్కులు, స్త్రీ సమానత్వం కోసం కృషి చేస్తున్నారు. నేషనల్ అలయెన్స్ ఆఫ్ ఉమెన్, ఇండియన్ నేషనల్ సోషల్ యాక్షన్ ఫోరంలో పనిచేస్తున్నారు.



**51. కల్పన కన్నబిరాన్ :** 'సెంటర్ ఫర్ నేషనల్ డెవలప్‌మెంట్' (హైద్రాబాద్) సంచాలకులుగా పనిచేస్తున్నారు. జెండర్ స్టడీస్, క్రిమినల్ లా లో విస్తృత అధ్యయనం, పరిశోధనలు చేశారు.

## 8. సముద్ర లంఘనం

**52. కవి** : 'సముద్ర లంఘనం' పాఠ్య కవి అయ్యలరాజు రామభద్రుడు. రామాభ్యుదయం కావ్యంలోని ఆరో ఆశ్వాసంలోనిది ఈ పాఠం.

**కాలం** : క్రీ॥శ॥ 16వ శతాబ్దివాడు. కడప జిల్లా ఒంటిమిట్ట ప్రాంతం వాడు.

**బిరుదులు** : 'చతురసాహిత్య లక్షణ చక్రవర్తి', 'ప్రతివాదిమదగజ పంచానన' అనే బిరుదులు ఉన్నాయి.

**ఇతర విశేషాలు** : ఇతడు శ్రీకృష్ణదేవరాయల ఆస్థానంలోని అష్టదిగ్గజ కవులలో ఒకరు. రామభద్రకవి రామాభ్యుదయ కావ్యాన్ని అళియ రామరాయల మేనల్లుడైన గొబ్బూరి నరసరాజుకు అంకితమిచ్చాడు. ఇతని మరొక రచన 'సకల కథాసార సంగ్రహం'. శ్రీరామ కథను ఎనిమిది ఆశ్వాసాల ప్రబంధంగా మలచాడు. ప్రతి పద్యంలో కల్పనాచాతుర్యం కనిపిస్తుంది. రామభద్రుని కవితా సామర్థ్యమంతా చమత్కారంతో కూడినదని అతని వర్ణనల ద్వారా ప్రస్ఫుటమౌతుంది.

## 9.మాణిక్యవీణ

**53. పరిచయం** : 'మాణిక్య వీణ' కవి విద్వాన్ విశ్వం. సాహితీవేత్తగా, రాజకీయ నాయకునిగా, పత్రికా సంపాదకునిగా బహుముఖీన దర్శనమిచ్చిన విశ్వం అసలు పేరు మీసరగండ విశ్వరూపాచారి. అనంతపురం జిల్లా తరిమెల గ్రామంలో లక్ష్మమ్మ, రామయ్య దంపతులకు జన్మించాడు.

**కాలం** : 1915 - 1987

**రచనలు** : మీజాన్, ప్రజాశక్తి, ఆంధ్రప్రభ, ఆంధ్రజ్యోతి పత్రికల్లో వివిధ హోదాల్లో పనిచేస్తూనే సంస్కృత భాషలోని పలుగ్రంథాల్ని తెలుగులోకి అనువదించాడు. పత్రికా సంపాదకునిగా 'అవి - ఇవి', 'తెలుపు - నలుపు', 'మాణిక్యవీణ' వంటి శీర్షికలను భాష, సాహిత్యం, సమాజం, నైతిక విలువలు తదితర అంశాలపై సంపాదకీయాలు, 'ప్రేమించాను' అనే నవల, 'ఒకనాడు', 'పెన్నేటిపాట' అనే కావ్యాలు విద్వాన్ విశ్వం కలం నుండి జాలువారిన రచనలు.

**బిరుదులు** : డి.లిట్., కళాప్రపూర్ణ.

## 10. గోరంత దీపాలు

**54.** **పరిచయం** : గోరంత దీపాలు కథా రచయిత పులికంటి కృష్ణారెడ్డి.

**కాలం** : 1931 - 2007

**రచనలు** : 1960లో ఆంధ్రపత్రికలో ప్రచురితమైన "గూడుకోసం గువ్వలు" ఆయన మొదటి కథ. సుమారు 150 కథలు రాశాడు. "నాలుగ్గాళ్ళ మండపం" అనేది ఈయన మరో రచన.

పులికంటి బుర్రకథకునిగా కుటుంబ సంక్షేమం, వాతావరణ కాలుష్యం - పొదుపు తదితర అంశాలమీద సుమారు వంద బుర్రకథలను రచించి తానే ప్రదర్శనలిచ్చాడు.

**ఇతర విశేషాలు** : జనజీవనాన్ని కళ్ళకు కట్టినట్టు రచనలు చేసిన కథారచయిత, నటుడు, జానపద కళాకారుడు, కవి, నాటక రచయిత, బుర్రకథకుడు శ్రీ పులికంటి కృష్ణారెడ్డి.

## 11. భిక్ష

**55.** **కవి** : కాశీఖండం సప్తమాశ్వాసం నుండి గ్రహించిన 'భిక్ష' కావ్య రచయిత శ్రీనాథుని తల్లిదండ్రులు మారయ, భీమాంబ.

**కాలం** : 1380 - 1470

**బిరుదు** : కవిసార్వభౌమ.

**రచనలు** : మరుత్తరాట్చరిత్ర, శాలివాహన సప్తశతి, పండితారాధ్య చరిత్ర, శృంగార నైషధం, భీమఖండం, కాశీఖండం, హరవిలాసం, ధనంజయవిజయం, క్రీడాభిరామం, శివరాత్రి మాహాత్మ్యం, పల్నాటి వీరచరిత్ర, నందనందన చరిత్రలు శ్రీనాథుని రచనలు.

**ఇతర విశేషాలు** : శ్రీనాథుని చమత్కారానికి, లోకానుశీలనకు, రసజ్ఞతకు, జీవితవిధానానికి అద్దంపట్టే చాటువులు చాలా ఉన్నాయి. ఉద్దండ లీల, ఉభయ వాక్ప్రౌఢి, రసాభ్యుచితబంధం, సూక్తి వైచిత్రి తన కవితాలక్షణాలని చెప్పుకున్న శ్రీనాథుడు సీసపద్యాలకు ప్రసిద్ధి.

## 12. చిత్రగ్రీవం

**56.** **రచయిత** : విశిష్ట రచయిత ధనగోపాల్ ముఖర్జీ రాసిన విలక్షణ పుస్తకం 'చిత్రగ్రీవం'.

**కాలం** : 1890 - 1936

**రచనలు** : జంతువులకు సంబంధించిన పిల్లల పుస్తకాలు తొమ్మిది రాశాడు. వీటిలో 1922లో రాసిన "కరి ది ఎలిఫెంట్", 1928లో రాసిన "గోండ్ ది హంటర్", 1924లో రాసిన "హరిశా ది జంగిల్ ల్యాడ్" పుస్తకాలు చాలా ప్రాచుర్యం పొందాయి.

**ఇతర విశేషాలు** : చిత్రగ్రీవం పుస్తకం 1928లో 'న్యూ బెరీ మెడల్'ను గెలుచుకుంది. బాలసాహిత్యంలో విశేషకృషి చేసినవారికి 'అమెరికన్ లైబ్రరీ అసోసియేషన్' వారు ఇచ్చే విశిష్ట పురస్కారం "న్యూ బెరీ మెడల్". ఈ బహుమతి గెల్చుకొన్న ఒకేఒక భారతీయ రచయిత "ధనగోపాల్ ముఖర్జీ".

# తరగతి - 10

## నేపథ్యాలు

### 1. మాతృభావన

**41.** మొదటి దండయాత్రలో 'కళ్యాణి' దుర్గం జయించిన తరువాత అబ్బాజీ సోన్‌దేవుడు విజయోత్సాహంతో శివాజీ వద్దకు వస్తాడు. అప్పుడు సోన్‌దేవుడు శివాజీతో "దేవా మీ ఆజ్ఞ ప్రకారం కళ్యాణిని జయించి దాని సర్దారును పట్టి బంధించి, సర్వస్వాన్ని, రాణివాస స్త్రీలను బందీలుగా తెచ్చాను" అని మనవి చేశాడు. ఇది విన్న శివాజీ పరస్త్రీలు తల్లులతో సమానం అని చెప్పి, ఆమెకు అగౌరవం కల్గించినందుకు చింతిస్తూ, ఇలా చేయడం తగదని హితవు పలికిన సందర్భంలోనిదీ పాఠ్యాంశం. స్త్రీలపట్ల గౌరవం చూపాలని తెలపడం మాతృభావన పాఠ్యభాగ ఉద్దేశం.

### 2. అమరావతి

**42.** ఆంధ్రప్రదేశ్‌కు నూతన రాజధానిగా అమరావతి నిర్మితమౌతోంది. చారిత్రక, సాంస్కృతిక, ఆధ్యాత్మిక నేపథ్యంగల అమరావతిని గురించి ఈనాటి ఆంధ్రులు తెలుసుకోవలసిన అవసరం ఉంది. మన రాజధానీనగరపు పూర్వ వైభవాన్ని తెలియజేయడమే ఈ పాఠ్యాంశం యొక్క ముఖ్య ఉద్దేశ్యం.

### 3. జానపదుని జాబు

**43.** భారతదేశం వ్యవసాయ ప్రధానమైన దేశం. అందువల్లనే భారతదేశం గ్రామాల్లో నివసిస్తోంది అంటారు. "గ్రామంలోని ప్రతి ఇల్లు విద్యాగంధంతో గుభాళించి, అభివృద్ధి చెందితేనే మనదేశం సుసంపన్నంగా, సస్యశ్యామలంగా ఉంటుంది" అని మహాత్మాగాంధీ అన్నారు. ఐతే గ్రామాలు ఎలా ఉన్నాయి? వారి జీవితాలు ఎలా ఉంటాయి? అనే విషయాలను వివరిస్తూ, గ్రామాల్లోని దళితులు, పేదల జీవితాలను చిత్రిస్తూ "పల్లెటూరి లేఖలు" అనే పేరుతో 1932లో 'జనవాణి' పత్రికలోనూ, 1933లో 'జానపదుని జాబులు' అనే పేరుతో 'ప్రజామిత్ర'లోనూ బోయి భీమన్న ప్రచురించాడు. చదువుకొని, బీదతనంవల్ల చదువు కొనసాగించలేక స్వగ్రామం పోయి పల్లెటూరి పనుల్లో మునిగిపోయిన 'జానపదుడు' పట్నంలోని శ్రీమంతుడైన తన మిత్రునికి తన అవస్థలను, గ్రామాల్లోని పరిస్థితులను 'లేఖల' రూపంలో రాస్తాడు. గ్రామపరిస్థితుల గూర్చి తెలపడమే ఈ పాఠ్యభాగ ఉద్దేశం.

గ్రామాల్లోని దళితులు, పేదల జీవితాలను చిత్రిస్తూ "పల్లెటూరి లేఖలు" అనే పేరుతో 1932లో 'జనవాణి' పత్రికలోనూ, 1933లో 'జానపదుని జాబులు' అనే పేరుతో 'ప్రజామిత్ర'లోనూ బోయి భీమన్న ప్రచురించాడు. చదువుకొని, బీదతనంవల్ల చదువు కొనసాగించలేక స్వగ్రామం పోయి పల్లెటూరి పనుల్లో మునిగిపోయిన 'జానపదుడు' పట్నంలోని శ్రీమంతుడైన తన మిత్రునికి తన అవస్థలను, గ్రామాల్లోని పరిస్థితులను 'లేఖల' రూపంలో రాస్తాడు.

### 4. వెన్నెల

**44.** హిరణ్యకశిపుడు వనవిహారం చేసిన సందర్భంలో వసంత ఋతువును, సాయం సమయాన్ని, చంద్రోదయాన్ని కవి వర్ణించాడు. రోజంతా తీవ్రమైన ఎండను ప్రసరింపజేసిన సూర్యుడు, ఇంకా ఉష్ణతాపాన్ని పెంచితే అసురనాయకుడైన హిరణ్యకశిపుడు సహింపడేమో అన్నట్లు నెమ్మదిగా పక్కకు తొలగిపోయాడు. తదనంతరం ప్రకృతిలో వచ్చిన మార్పులను రమణీయంగా వర్ణించిన రీతిని తెలియజేయడమే వెన్నెల పాఠం ఉద్దేశం.

## 5. ధన్యుడు

**45.** మంచిమిత్రుల కలయిక మన జీవితాన్ని ఓ మలుపు తిప్పుతుంది. అందుకే ఎప్పుడూ సన్మిత్రులను పొందాలని పెద్దవాళ్ళ చెబుతుంటారు. సజ్జన సాంగత్యం ఎప్పటికీ మంచిదని చెప్పడమే ఈ పాఠం ఉద్దేశం.

## 6. శతక మధురిమ

**46.** శతకాలు నైతిక విలువలను పెంపొందింపజేస్తాయి. భావిజీవితాన్ని తీర్చిదిద్దుతాయి. శతక పద్యాల్లోని నైతిక విలువలను తెల్పడమే ఈ పాఠం ఉద్దేశం.

## 7. మా ప్రయత్నం

**47.** ఒక పుస్తకం తాత్వికతను, అంతస్సారాన్ని, ఆశయాల్ని, శ్రమను తెలియజేసేదే ముందుమాట. ముందుమాట వల్ల పుస్తకాన్ని చదవాలనే ఆసక్తి పెరుగుతుంది. మంచి పుస్తకాన్ని ఎలా ఎంపిక చేసుకోవాలో తెలుస్తుంది. అలాంటి 'ముందుమాట'ను పరిచయం చేయడమే ఈ పాఠ్యాంశ ఉద్దేశం.

## 8. సముద్ర లంఘనం

**48.** సీతాన్వేషణలో రామలక్ష్మణులు కిష్కింధకు చేరుకుంటారు. సుగ్రీవునితో స్నేహం చేస్తారు. సుగ్రీవుడు సీతను వెతకడానికి వానర సైన్యాన్ని నాలుగు దిశలకు పంపిస్తాడు. ఆంజనేయుని బృందం దక్షిణ దిశకు వెళ్తుంది. జాంబవంతుని ప్రోత్సాహంతో ఆంజనేయుడు మహేంద్రగిరి నుంచి సముద్ర లంఘనానికి సిద్ధమౌతాడు.

**ప్రస్తుత పాఠ్యభాగం అయ్యలరాజు రామభద్రుడు రచించిన "రామాభ్యుదయము" అను ప్రబంధంలోని ఆరవ ఆశ్వాసం లోనిది.**

## 9. మాణిక్యవీణ

**49.** ఆంధ్రప్రభ వారపత్రికలో విద్వాన్ విశ్వం 'మాణిక్యవీణ' శీర్షికన వ్యాసాలు, కవితలు రచించారు. మాణిక్యవీణలో వీరు స్వీకరించని అంశం లేదని చెప్పవచ్చు. మానవజీవన ప్రస్థానంతో కళ, కవిత్వం పెనవేసుకున్నాయని, మనిషి నిరంతర జ్ఞానాన్వేషి అని ఈ కవిత తెలుపుతుంది. మాణిక్యవీణను మీటి, మానవీయ రాగాల్ని పలికించిన ఈ కవిత చారిత్రక ఘట్టాల్ని తరచి చూపి మనిషి శాశ్వతత్వాన్ని తెలుపుతుంది.

సాంకేతిక రంగంలోని అభివృద్ధిని మాత్రమే అభివృద్ధి అనుకుంటూ కళలను, సాహిత్యాన్ని ఉపేక్షిస్తూంది నేటితరం. మానవజీవితంతో ముడివేసుకున్న కళలు, సాహిత్యం అనాదిగా సంక్రమించిన ఆస్తి అని తెలుపుతూ, విజ్ఞానమార్గంలో ప్రయాణించి సంస్కృతిని గౌరవిస్తేనే మనిషి శాశ్వతుడవుతాడని తెలపడమే ఈ పాఠం ఉద్దేశం.

'మానవ జీవనప్రస్థానంతో కళ, కవిత్వం పెనవేసుకున్నాయి. మనిషి నిరంతరం జ్ఞానాన్వేషి. సాంకేతిరంగంలోని అభివృద్ధి మాత్రమే ప్రధానం కాదు. కళలు, సాహిత్యం కూడా ఉండాలి. అది మనకు అనాదిగా వస్తున్న ఆస్తి. విజ్ఞాన మార్గంలో నడుస్తూ సంస్కృతిని గౌరవించాలి. అప్పుడే మనిషి శాశ్వతుడవుతాడు' అని తెలపడమే ఈ పాఠం ఉద్దేశం.

## 10. గోరంత దీపాలు

**50.** **నేపథ్యం :** సమాజంలో ఎంతోమంది అనాథ బాలలను మనం చూస్తూ ఉంటాం. ఇటువంటి పిల్లలు కనీస అవసరాలైన తిండి, బట్ట, చదువు మొదలైన వాటికి నోచుకోకుండా ఉంటారు. అనాథబాలలను చేరదీసి వారి ఆకలి తీర్చి విద్యాబుద్ధులు చెప్పిస్తే వీరు కూడా మట్టిలో మాణిక్యాల్లాగ వెలుగొందుతారు. సమాజానికి సేవచేసే గొప్ప మనసున్న వ్యక్తులు, తమ ఆస్తిపాస్తులతో సంబంధం లేకుండా అనాథలను చేరదీసి చదివించేవారు కూడా ఎంతో మంది ఉన్నారు. అటువంటి ఒక వ్యక్తి చేసిన పనే ఈ కథ.

**ఉద్దేశం :** రైలు ప్రయాణంలో తటస్థపడిన ఓ బాలుణ్ణి చేరదీసి విద్యాబుద్ధులు చెప్పిస్తే, ఎదిగిన ఆ వ్యక్తి చూపే కృతజ్ఞతా భావం, వారి మధ్య ఉండే మానవసంబంధాలను తెలియజెప్పడమే ఈ పాఠం ఉద్దేశం.

సమాజంలో ఎవరూ పట్టించుకోని అనాథబాలలు ఎంతో మంది ఉన్నారు. తిండి, బట్ట, చదువు దేనికీ నోచుకోని అభాగ్యులు వీరు. వీరిని చేరదీసి చేయూతనిచ్చి ఆదరించి విద్యాబుద్ధులు చెప్పిస్తే మట్టిలో మాణిక్యాల్లా మెరుస్తారు. సమాజానికి సేవచేసే గొప్ప మనసున్న వ్యక్తులు, తమ ఆస్తిపాస్తులతో సంబంధం లేకుండా అనాథలను చేరదీసి చదివించేవారు కూడా ఎంతోమంది ఉన్నారు. అటువంటి ఒక వ్యక్తి చేసిన పనే గోరంత దీపాలు పాఠం కథ.

రైలు ప్రయాణంలో తటస్థపడిన ఓ బాలుణ్ణి చేరదీసి విద్యాబుద్ధులు చెప్పిస్తే ఎదిగిన ఆ వ్యక్తి చూపే కృతజ్ఞతా భావం, వాళ్ళ మధ్య ఉండే మానవ సంబంధాలు తెలియజెప్పడమే "గోరంత దీపాలు" పాఠం ఉద్దేశం.

## 11. భిక్ష

**51.** వేదవిభజన చేసి, పంచమవేదంగా పేరున్న మహాభారతాన్ని రచించి, అష్టాదశ(18) పురాణాలను రచించిన బ్రహ్మజ్ఞాని వేదవ్యాసుడు. పరమ పవిత్రం, పరమేశ్వరునికి ప్రీతిపాత్రం అయిన కాశీలో వ్యాసుడు తన పదివేలమంది శిష్యులతో కొంతకాలం నివసించాడు. బ్రాహ్మీముహూర్తంలో నిద్రలేచి, ప్రాతర్మాధ్యాహ్నిక విధులను పూర్తిగావించి శిష్యులతోకూడా కాశీనగరంలో భిక్షాటనం చేసేవాడు. శిష్యులు, తానూ వేరువేరుగా తెచ్చిన భిక్షలో సగం అతిథి అభ్యాగతులకు సమర్పించి, మిగిలినది భుజించేవారు. ఒకరోజున కాశీ విశ్వనాథుడికి వ్యాసుణ్ణి పరీక్షించాలన్న సంకల్పం కలిగింది. ఆ సందర్భంగా జరిగిన సంఘటనే ఈ పాఠ్యాంశం.

వ్యాసమహర్షి తన పదివేల మంది శిష్యులతో కలిసి పరమ పవిత్రమైన కాశీలో కొంత కాలం నివసించాడు. భిక్షాటన చేసి శిష్యులూ, తానూ వేరువేరుగా తెచ్చిన భిక్షలో సగం అతిథి అభ్యాగతులకు సమర్పించి మిగిలినది భుజించేవారు. ఒకసారి కాశీ విశ్వనాథునికి వ్యాసుని పరీక్షించాలని సంకల్పం కలిగింది. ఆ సందర్భంగా జరిగిన సంఘటనలు 'భిక్ష' పాఠ్యభాగం.

## 12. చిత్రగ్రీవం

**52.** మనదేశంలో వృక్షసంపద, పక్షిసంపద అపారం. ఐతే వీటిని గురించి తెలియజేసే మంచి పుస్తకాలు అరుదుగా ఉన్నాయి. పూర్వకాలంలో సమాచారాన్ని చేరవేయడానికి పావురాలను ఉపయోగించేవారు. పావురాల పుట్టుక, వాటి జీవన వివరాలకు సంబంధించిన కథనాలతో కూడిన పుస్తకం చిత్రగ్రీవం. కలకత్తాలో ఓ పెంపుడు పావురం, దాన్ని పెంచే ఓ బాలుడూ, వాళ్ళ కథను మనసుకు హత్తుకుపోయేలా చెప్పిన పుస్తకం చిత్రగ్రీవం. చిత్రగ్రీవం పిల్లలకోసం రాసిన పుస్తకమే ఐనా దీనికి ప్రకృతి పరిశీలకులను కూడా అలరించే శక్తి ఉంది. పావురాల జీవనానికి సంబంధించిన అతిసూక్ష్మ వివరాలు తెలియచెప్పడమే ఈ పాఠం ఉద్దేశం.

# తరగతి - 10

## ప్రక్రియలు

### 1. మాతృభావన

15. ఆధునిక తెలుగు సాహిత్యప్రక్రియలలో ఆధునిక పద్యకావ్యం ఒకటి. ఇందులోని పద్యాలు గ్రాంథిక భాషకు దూరంగా ఉంటాయి. ఇవి వాడుక భాషాపదాలతో, లయబద్ధంగా ఉంటాయి. సమాజాభ్యుదయము, రక్తి, భక్తి ప్రధానాంశాలుగా ఉంటాయి. పద్యాలలో ఎక్కువగా ఆధునిక భాష ఉంటుంది.

### 8. సముద్రలంఘనం

16. వర్ణనాప్రధానమైన కావ్యాలు ప్రబంధాలు. శ్రీకృష్ణదేవరాయల కాలాన్ని (16వ శతాబ్దం) తెలుగు సాహిత్య చరిత్రలో 'ప్రబంధయుగం' అంటారు. పురాణ, ఇతిహాసాల నుండి చిన్న కథను తీసుకొని వర్ణనలు కలిపి పెంచి స్వతంత్ర కావ్యంగా రచిస్తే దాన్ని 'ప్రబంధం' అంటారు. వీటిలో అష్టాదశ (18 రకాల) వర్ణనలుంటాయి.